నున్న గోరీమీదికి పోతిని. తరువాత అది నిటారుగా నిలబడెను. తరువాత ఒక నగ్న అస్థిపంజరము తన వంగిన పీపుతో ఆ రాతిని యెత్తుచుండెను. ఆ రాత్రి అంత చీకటిగ నున్నను నేనిదంతయు చూడగలిగితిని. ఆ క్రాస్‌మీద యిట్లు వ్రాయబడి వుండెను:

"జేక్స్ ఓలివంట్ యిచ్చట విశ్రమించుచున్నాడు. ఈయన గౌరవనీయుడు, దానకర్ణుడు.తన కుటుంబమును చాలా ప్రేమించెను."

ఆ మృతజీవి ఆ లిఖితమును చదివెను. ఒక సన్నని రాతితో దానిని చెరిపివేసెను. గుంటలుగానున్న తన కండ్లతో అవి లిఖింపబడివున్న స్థలమును పరిశీలించి చూచెను. తన గోటితో (అది ఒకప్పుడు తన చూపుడువ్రేలు) మెరయు అక్షరములతో నిట్లు వ్రాసెను:

"51 వ సం॥న మరణించిన జేక్స్. తండ్రి ఆస్తి బడయగోరి ఆయన పరలోక యాత్రను త్వరపరచెను. భార్యా బిడ్డలను హింసించెను. ఇరుగుపొరుగువారిని మోసపుచ్చెను. అందరిని దోచుకొని కడకు వేసారియై చనిపోయెను."

పూర్తిగా వ్రాసిన తరువాత ఆ మృతజీవి చలింపక అట్లే తను వ్రాసినదానిని చూచుచు నిలువబడి యుండెను. నేను తిరిగి చూచునప్పటికి అన్ని గోరీలనుండి మృతజీవులు పైకి వచ్చి వారి బంధువులు వ్రాసిన విషయములను తుడిచివైచి సత్యమును వ్రాయుచుండిరి. వారంతా భార్యా బిడ్డలను హింసించి, ఇరుగుపొరుగు వారిని మోసముచేసి యింకా యెన్నో చెప్పరాని అపరాధములచేసిరి. వారంతా ఒకే పర్యాయము వ్రాయుచుండిరి. సత్యమును వ్రాయుచుండిరి. పవిత్రమైనటువంటి సత్యమును వక్కాణించుచుండిరి. వారు బ్రతికివున్నప్పుడు అందరకు తెలియనటువంటియు, తెలిసియు తెలియనట్లు నటించి నటువంటి సత్యము.

ఆమెకూడ యేమైనా వ్రాసియుండునని ఆమె గోరీవైపు, సగము విడిన గోరీల మధ్య నుండి నిర్భయముగా పరుగెత్తుకు వెళ్ళితిని. వెంటనే ఆమెను గుర్తించితిని. ముఖముపై తెల్లని వస్త్రముండెను.

"ప్రేమించి, ప్రేమింపబడి పరలోకమున కేగెను" పైదాని స్థానములో యిట్లుండెను:

"తన ప్రియుని మోసగించుటకై ఒకానొక రాత్రి, వాన కురియుచుండగా, బయటకు వెళ్ళి చలి జ్వరమువలన చనిపోయినది."

* * *

మరుసటిదినము ఉదయమున స్పృహతప్పి గోరీపై పడివుండగా నన్ను చూచిరట!

---

స్కెచ్

# విధుర జీవనం

అనసరాల రామకృష్ణరావు

"ఏమే, సుభద్రా, అబ్బ, ఎంతకీ పలుకవేమే, నిన్ను పిలిచేసరికి నా నోరు పడిపోతూంది. చిక్కుడుకాయ ముక్కలు తేవేమే! అబ్బబ్బ! ఫిరంగి మోతయినా నీ చెవులో మురళీనాదమే గదా!" గిరిజమ్మ కేకలు వినేసరికి సుభద్ర గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

"అప్పుడే పొయ్యిమీద మూకుడెందుకు పెట్టేరత్తయ్యా, దించెయ్యండి. ఇంకా ఇప్పుడే చిక్కుడుకాయలు ఒలవడం మొదలెట్టేను" అంది భయంతో.

"అయిందీ, నేననుకొంటూనే ఉన్నాను. ఇంతసేపూ ఎక్కడ తగలడ్డావే! ఈ వెధవ పొట్టకోసమే కదా ఏంచేసినాను!" గిరిజమ్మ కళ్లు గట్టిగా నులుపుకొని పొయ్యిమీదనుంచి మూకుడు విసురుగా దింపింది. ఆ దింపడంలో కొత్త నూనె రుబ్బురోలులా ఉన్న గిరిజమ్మ విజయనగర వరం (బూరకాలు) మీద పడింది. దాంతో ఆవిడ యిల్లెగిరిపోయేలా 'బాబోయ్' అని కేకెట్టింది. సుభద్ర ఒక్క గంతులో వచ్చి,

"ఏమిటత్తయ్యా, అయ్యో, నూనె తెస్తానుండండి" అని వెళ్ళబోయింది. గిరిజమ్మ ఒక

చేత్తో కాలుపట్టుకుని రెండో చెయ్యి నేరుగా సుభద్ర జుత్తులోకి పోనిచ్చి గుంజాయిస్తూ,

"నీనుంచే యింతా వచ్చింది. చెప్పినవెంట నే పనిచేస్తే నీ సిరేం తీసిపోయిందే. ఇంతసేపూ ఎక్కడ చచ్చావ్" అంది. సుభద్ర బొటబొట కన్నీరు కారుస్తూ,

"ఇవాళ శనివారం, మీరు భోంచెయ్యరని నిన్న నీళ్లలో పోసిన శేరు మినప్పప్పు రుబ్బుతూ కూర్చున్నా. మీమాటలు వినపడలేదు" అంది.

"ఎందుకు వినపడుతుందీ, ఉన్నన్నాళ్ళూ ఏం కష్టపడ్డాడో నా చిట్టితండ్రి. మంగలంలో వేసినట్టు వేయించేసేదానివి కదా!"

నొప్పెడుతున్న జుట్టుబాధ, ములుకుల్లాంటి మాటలబాధ, ఈ బాధల వ్యథలో భర్త మధుర నామోచ్చారణ సుభద్రకు, జరిగిన సంఘటనలు జ్ఞప్తికి తెచ్చాయి.

* * *

"ఎవరురా యిది? గుడ్లగూబలా కళ్ళూ యిదీను!"

ఈ అసభ్యతాహ్వానం ఆ క్రొత్త దంపతులకు వింతగా తోచింది. అయినా శేషగిరి నమ్రతగా,

"నీకు చెప్పేనుగా అమ్మా, సుభద్రని. మన వాళ్ళ పిల్ల" ఈమాట అన్నాడో లేదో గిరిజమ్మ రెండు చేతులూ గజం ఎడంగా సాగిపోయాయి.

"ఓయబ్బో! ఇలాంటివాళ్లను చాలామందిని చూశాం. ఎందుకు తీసుకొచ్చినట్టు?"

ఈమాటకు జవాబుగా శేషగిరీ సుభద్రా ఒకరి కళ్లల్లో ఒకరు శాంతంగా, తీయగా చూసుకొన్నారు.

"ఓహోహో! ఇలాంటి సినిమా రౌడీ వేషాలేం యిక్కడ పనికిరావు. నాకు బోధపడిందిలే ఎందుకో! కట్నం ఏ మాత్రం యిస్తారు?" అంది కోపంగా.

"అమ్మా, నీ కొడుకుని అమ్ముకోడానికా కన్నావ్?" కొడుకు వేసిన యీ ప్రశ్నకు గిరిజమ్మకు వెంటనే జవాబు తోచక కోపంగా మొహం అటు తిప్పేసుకుంది.

"అమ్మా, నన్ను క్షమించు. నీఆజ్ఞ లేకుండా వివాహమాడినందుకు మన్నించు. ఈమె నీ కోడలు. ఈ సంబంధం తప్పదు."

గిరిజమ్మ ఖిన్నురాలైంది. ఆమె ఆశలు అడుగంటేయి. ఆమె కోర్కెలు నశించాయి. బోలెడు కట్నం పుచ్చుకొని ఒంటినిండా వస్తువులతో, అతి వైభవంగా, కన్నుల పండువుగా తన ఒకానొక్క కొడుకుకి పెళ్ళిచేద్దా మనుకుంది. ఆఖరికి తనకళ్ళ పడకుండా వివాహం కూడా జరిగిపోయిందెట. చావలివారి కోడలు తక్కువసారె తీసుకొచ్చిందని అమె అత్తను దెప్పి పొడిచిన తను యింకేం సమాధానం చెబుతుంది? వింజమూరి వారికోడల్ని తను యింకేం అనగలదు? ఆమె అసూయ, కోపం సుభద్రపై తీర్చుకుంది.

భగవంతుడు ఉన్నాడో లేదో, ఉన్నా అనాథులపట్ల తనూ అనాథుడేమో! లేకపోతే అత్తగారు ఎంత బాధపెట్టినా మగని మధుర మమతలో అన్నీ మరచిపోయే తనను ఆయన నుండే వేరు చెయ్యాలా? ఆయన బాధతో ఆఖరి మాటలుగా "సుభద్రా, మా అమ్మ కొంచెం కోపదారిమనిషి. నిన్ను దిక్కులేని దానివని చేరదీసి ఆదరించినా, నా సంస్కారం సఫలీకృతం, సంపూర్ణం అవలేదు. ఇక నీకు మా అమ్మే సర్వస్వం. మా అమ్మలో నా ప్రతిబింబం చూసుకుని నాపై ప్రేమను ఆమె సేవకు వినియోగపర్చు" ఇచ్చిన సందేశం జ్ఞాపకం రాగానే సుభద్ర కన్నీరు తుడుచుకుని, చెరిగిన ముంగురులు సరిచేసుకుని గిరిజమ్మ సపర్యలలో మునిగిపోయింది.

* * *

"ఇదేమిటేవ్ గిరిజమ్మ తల్లీ! ఓ కార్డు ముక్కైనా లేకుండా యీ అర్థాంతపు రాక!" అంది వెంకమ్మ వణుకుతూ. అసలే ముసిలి కాలం, అందులో చలికాలం! గిరిజమ్మ వెంటనే జవాబు చెప్పకపోవడం చూసి,

"సామాన్లు లోపల పెట్టరా అబ్బాయ్- ఏమే కోపలా మాట్లాడవేం?" అంది తిరిగి.

"ఏం చెప్పను అత్తా నా అవస్థ? మీ యింట్లోఉన్న నాలుగురోజులూ ఏం సుఖపడ్డానో అంతే"

అంది గిరిజమ్మ. లోపల ఏమనుకుందో గాని "ఊం అయితే?" అంది వెంకమ్మ.

"ఆ మొగ మహారాజు లాలనలో గొడుగులా మీరు అన్నిటికీ కాపాడుతూంటే ఏం అనుభవించానో" ఇక మాట్లాడలేక, సమయానికి తగు దుఃఖం రాలేదని విచారిస్తూ, వెంకమ్మను గిరిజమ్మ కౌగలించుకుంది.

"ఎన్ని వేషాలు వచ్చునే నీ మొహం యీడ్వా!" అని ముసిల్ది లోలోన వున్న రెండు పళ్ళూ కొరికినా పైకిమాత్రం విధిలేక గిరిజమ్మ పట్ల సానుభూతి ప్రకటించింది. గిరిజమ్మ కళ్లు నులుపుకుంటూ,

"నాకుమాత్రం ఎవరున్నారు అత్తా? ఆ కోడలిచేత బాధపడలేక, చెప్పి చేయించుకోలేక, లాభం గూబల్లోకివచ్చి నోరు పడిపోయి, ఏదో నాలుగురోజులు మీపంచ నుందామని చక్కావచ్చాను. నా కడుపునపుట్టిన కొడుకు పోయాక యింక నాకూ దానికీ సంబంధ మేమిటత్తా?" అంది. "ఆ లెక్కన నీకూనాకూ ఉన్న సంబంధ మేమిటో!" అని అనుమానం తోచక పోలేదు వెంకమ్మకి.

* * *

"ఉస్సు! అబ్బ! వేడి, బాబోయ్ వేడి! చెవుల్లోకి హోరు వచ్చేస్తోంది-గూట్లో భృంగామలక తైలం ఉంటుంది; కొస్త తెచ్చి మర్దన చేయ్ గిరిజా" అని అరచింది వెంకమ్మ.

"అంతలో నోరు పారేసుకుంటూ రెందుకత్తయ్యా, మరింత నీర్సం రాడానికి-గాని! బట్ట మార్చి వస్తున్నా నుండండి. మళ్లీ మైల పడిపోతే స్నానంచెయ్యాలి" అని వంటింట్లోంచే జవాబు చెప్పింది గిరిజమ్మ.

"నువ్వు చీర మార్చేలోగా యీ ప్రాణం నిలబడుతుందిటే?"

"నిలబడకపోతే కూర్చోమనండి. అంత ఊదూడు ప్రాణం నిలబడ్డం కష్టమే" అనుకుంది గిరిజమ్మ.

"ఒసేవ్, గిరిజమ్మోయ్...ఉష్ణం కమ్మేస్తోందేవ్! చెవులో యిన్ని పాలచుక్కలేనా పొయ్యవేవ్!"

"అబ్బ! చూస్తే జానెడు మనిషి. లేదు. ఈ మనిషికి యింత చాకిరీ ఏమిటి బాబూ! తలమీద ఎప్పటి కప్పుడు నాలుగు వెంట్రుకలేనా ఉండనివ్వదు. దానికి చచ్చే మర్దనా. అయినా కోడళ్ళను చూసేసరికి యీ అత్తగార్లకు లేని జబ్బులు పుడుతుంటాయి కాబోలు. రాధాస్వామి! చేతులు పడిపోతున్నాయి. అయినా ఒహరి చేత చేయించుకోడమేగాని ఒకరికి చేసి ఎరుగను. తలమీద ముసుగు సరిచేసుకుని కృష్ణా రామా అంటూ ఓమూల పడుండక యీ 'అథార్టీ' ఏమిటి బాబూ! చెవి గోసిన మేకలా యీ అరుపు లేమిటి, ఎడతెరిపిలేని యీ చాకిరీ ఏమిటి? చాలు బాబూ చాలు. మూడు రోజులకే కళ్లు చీకట్లు కమ్మి, చెవులు గడియలడుతున్నాయి! ఇంతకన్న సుభద్రే నయం!" అనుకుంది గిరిజ.

* * *

"వెళ్లొస్తా నత్తయ్యా" అంది గిరిజమ్మ హఠాత్తుగా.

"అదేమిటే నాలుగు రోజులపాటు ఉంటానన్నావు కాదుటే" అంది ఏమీ ఎరుగనట్టు వెంకమ్మ.

"ఏం ఉండను అత్తయ్యా పైకి మీలా చెప్పుకోనుగాని నాకే పుట్టెడు జబ్బు-నే ఒకరికి చాకిరీ ఏంచెయ్యను? ఏదో చల్లగా నాలుగు రోజులు గడుపుదామని వచ్చానుగాని నాకేం గడవక రాలేదు." అలా ఉందిగాని ముసిల్ది తక్కువదా? తగినట్టు జవాబు చెప్పింది.

"ఇదిగో, ఇలాచూడు గిరిజా, మనం చూసే విధాల చూడాలి గాని ఎవరేనా గడవక మన గుమ్మం తొక్కుతారుటే?" ఈ మాట గిరిజమ్మకు నసాళం అంటింది. తన స్వానుభవం ఆమె ముందు గిరుక్కున తిరిగింది. దెబ్బతిన్న లేడిలా దిక్కులు చూడ సాగింది - అయినా ఊరుకోలేక యిలా అంది.

"ఎందుకు లెండత్తా, కళ్ల కద్దుకొని సేవ చేస్తున్న సుభద్రను ఒదిలి రావడం నాదే బుద్ధి తక్కువ. "అత్తా ఒక యింటి కోడలే!" అన్న జ్ఞానం నాకానాడు లేకపోయింది!"

"నీకా జ్ఞానం కలిగినాడు నేను నిన్ను కడుపులో పెట్టుకొని కాపాడనటే వెర్రి తల్లీ! నాకు మాత్రం ఎవరున్నారు గనుక? ఆ సుభద్రమ్మను పిలిపించు. అందరం కలిసి ఏకమాట ఆడుకొని హాయిగా పడుందాం" అంది వెంకమ్మ.